# అమ్మ

**అతను** నన్ను అమ్మివేశాడు!

వారు కొనుక్కున్నారు? వారు ఒకరు స్త్రీ, ఇంకొకరు పురుషుడు. వారిద్దరూ భార్యాభర్తలు. ఆవిడ నన్ను చూచి చాలా సంబరపడింది. నన్ను తన హస్తాలతో మృదువుగా ఎత్తుకుని, తన ఎదకు హత్తుకొన్నది. ఆమె సంతోషం, ఆమె ఒడిలోని వేడి నాకు హితంగా ఉన్నాయి. వారిద్దరూ నన్ను తమ ఇంటికి తీసుకుపోయారు.

000

'అమ్మ' నన్ను విడిచిపెట్టి ఒక్క క్షణమైనా ఉండదు. నాతోగూడి చిన్నపిల్లలా ఆడుకుంటూంది. నన్ను కౌగలించుకుని ముద్దాడుతోంది. నన్ను తన గదిలో ఉంచుకుని పెంచ నారంభించింది. నాకు బిస్కట్లను తినిపిస్తుంది. పాలు పోయిస్తోంది. నేను తింటూ ఉన్నప్పుడో, పాలు తాగుతున్నప్పుడో నా తల, వీపును మమకారంతో నిమురుతూంటుంది. నేను పాలు తాగి, అమ్మ ముఖం చూస్తే, అమ్మ కళ్లలో ఎందుకో నీటి చుక్కలు నిలిచి ఉంటాయి.

000

ఒకరోజు మధ్యరాత్రి సమయం. నేను సుఖంగా నిదురిస్తూంటే, ఏదో సవ్వడి వినబడింది. నేను లేచి కూర్చున్నాను. మంచంపైకి చూచాను. అమ్మ ఉండలేదు ... రాత్రివేళలో నాకు అప్పుడప్పుడూ మెలకువ వస్తూంది. అప్పుడు నేను మంచాన్ని చూస్తూంటాను. అమ్మ సుఖంగా నిదిరిస్తూ ఉంటోంది. అయితే ఈనాడు అమ్మ కానరాలేదు. నన్ను ఒంటరిగా విడిచిపెట్టి ఎక్కడికెళ్లిపోయిందో ...? ఉన్నట్టుండి పక్క గదినుంచి భార్యా భర్తలు సంతోషంగా నవ్వే సవ్వడి వినిపించింది ... నేను మరలా హాయిగా నిద్రపోయాను.

000

నేను తోటలో పతంగాలను పట్టుకోడానికి గాలిలో ఎగురుతూ, వాటిని వెంబడిస్తాను. చెట్టు కొమ్మలపై అల్లరి చేసే కోతులని చూచి వాటిని వ్యర్థంగా పట్టుకోడానికి ప్రయత్నిస్తూ, నా మనస్సుకు తోచినట్లు ఆడుకుంటాను. ఇప్పుడిప్పుడు అమ్మ నన్ను తోటలో ఆటలాడనిస్తుంది. పూర్వంలా నన్ను ఎప్పుడూ ఎత్తుకోడంలేదు. ఆ రోజు నేను తోటలో ఆటలాడి, చివరికి చాలనిపించి అమ్మను చూడటానికి, అమ్మ చేత్తో బుజ్జగించుకోడానికి మిద్దెమీదికి వడిగా పరుగెత్తాను. గదిలో కెళ్లాను. అయితే అమ్మ చేతుల్లో బిస్కెట్లుగానీ, పాలుగానీ ఏదీ లేదు! దానికి బదులు, ఓ పాపాయి బొమ్మ ఉంది. నేను అమ్మ దగ్గరకు వెళ్లి నిలబడ్డాను. కానీ అమ్మ నన్ను చూడలేదు. నాకు ఎట్లాగో అనిపించింది. అమ్మ ముఖాన్ని ఒకసారి, ఆ బొమ్మ మూతిని ఒకసారి చూశాను. ఆ బొమ్మ పెద్దగా నవ్వుతూంది. లేతబాలను "ఎత్తుకోవా?" అన్నట్టు ముందుకు జాచింది. నల్లబల్లపై చతికిలపడింది. అమ్మ కళ్లలో కొత్త కాంతి నిండి ఉంది. పెదవుల పైన చిన్న నవ్వొకటి చిందింది. చెక్కిళ్లలో సంతోషం 'మినమిన' అంటూ ఉంది. ఒక్క క్షణంసేపు ఆ బొమ్మనే కంటినిండా చూచి తటుక్కున దాన్ని ఎత్తుకొని, తన హృదయానికి బలంగా హత్తుకున్నది! ...

ఓ, నన్ను కూడా మొదట్లో ఇట్లాగే కౌగలించుకొన్నది. అయితే ఇప్పుడూ? ... నాలో ఏదో బాధ రగుల్కొన్నది. నేను అమ్మ చూపులను నా కడకు మళ్లించడానికి అమ్మ కొంగును లాగాను. ఆమె తిరిగి, చూచింది. అదే చిరునవ్వు! అయితే నన్నొకసారి చూచి మరలా ఆ బొమ్మ లాలనలో పడిపోయింది, నన్ను మర్చిపోయి ...!

**శ్రీ వీరభద్రం**

000

ఒకరోజు నేను తోటలో ఆడుకొని, అమ్మ గదిలో కెళ్లాను. ఎవ్వరూ ఉండలేదు. నా కళ్లు, అమ్మంత ఎత్తున ఆ నల్లబల్లపై నవ్వుతూ ఉన్న బొమ్మపై నిలిచాయి. దానిపైన పట్టలేనంత కోపం వచ్చింది. ఎందుకంటే, దాని మూలాన అమ్మ నన్నిప్పుడు ప్రేమతో చూడడం లేదుగా? బల్ల సమీపించాను. ఆ బొమ్మను పడగొట్టాలని ప్రయత్నించాను. అంతట్లో కొయ్యమెట్లపై పాదాల చప్పుడయింది. నేను ఏమీ ఎరగనట్లు, ఊరకనే ఉండిపోయాను బొమ్మని తిలకిస్తూ. అమ్మ వచ్చింది. నన్ను చూచింది. నేనట్లా బొమ్మను చెవులు నిలబెట్టి చూస్తూండడం గమనించి బొమ్మని ఒకసారి, చూచింది. తక్షణం నా దగ్గిరకొచ్చి నన్ను ఎత్తుకొని "దాన్ని అట్లా ఎందుకు చూస్తావ్? అది ఉత్త బొమ్మ! అంతే! ఇంకా కొన్ని రోజులు పోనీ, అట్లాంటిదే పాప నిస్తాను, నీకు ఆడుకోటానికి ..." కిలకిలా నవ్వింది. మరలా "బొమ్మని చూడాలనుందీ? చూడు, బాగా చూడు!" అని అంటూ, నన్ను బొమ్మకు అతి సమీపంగా తీసుకెళ్లింది. నేను "వూహుఁ" అన్నట్లు ముఖం తిప్పుకున్నాను. ప్రమాదవశాత్తుగా నా బుంగమూతి తగిలి బొమ్మ కిందపడింది. 'టక్....టక్'మని ముక్కలు ముక్కలయింది. ఎక్కడ లేని కోపం ముంచెత్తుకొచ్చింది అమ్మకి. నెత్తిపైన మొట్టికాయ వేసింది. "ఉండు, నీ పని చెప్తా!" అంటూ మూల ఉన్న తీగబెత్తం తీసుకుని, కోపావేశంతో నన్ను చావమోదింది. చేతులు సోలిపోయేవరకూ కొట్టింది. చివరకి చిక్కుమంటూ బెత్తాన్ని నేలకేసి విసిరి 'సరసర' గదినుండి వెళ్లిపోయింది అమ్మ ....

నాకు ఎడుపొచ్చింది ...

నా ఒళ్లంతా బాధపడింది ...

000

నేనిప్పుడు అమ్మ గదిలో లేను. నన్నప్పుడే, ఆనాడే, పనిమనిషి సాయంతో గదినుంచి వెళ్లగొట్టి, కింద వుంచడమయింది....! నేనిప్పుడు అమ్మను చూడక దినాలు దొర్లిపోయాయి ... ఇట్లుండగా, ఒకరోజు ఇంటిముందు ఉన్నట్టుండి ఎన్నో కార్లు వచ్చి నిలబడ్డాయి. కారుల్లోంచి ఆడా, మగా, పిల్లా .... ఇట్లా దిగుతూనే ఉన్నారు. లోపలికెళ్తూనే ఉన్నారు. బయటి అరుగుమీద మేళగానం. ఇంటిలోపల గుమిగూడిన వారందరూ చేసే సంబరం. వీటి మధ్య నన్నెవరడుగుతారు? ... అమ్మను చూడక దుఃఖంవేస్తోంది. చూడాలని ఆశగా ఉంది. అయితే అమ్మ గది నుండి బయటికి రాదు గదా? ఎట్లా చూడాలి? ఏం చేయాలి? ... ఈ రోజు ఎట్లాగైనా, రాజకీయనాయకులు: జనం మధ్య దూరి, అమ్మ నోసారి కంటినిండా చూడాలి ... అంతే ... ప్రయత్నించాను. గుంపులో దూరి చివరికి అమ్మ కూర్చున్న స్థలాన్ని చేరుకున్నాను. అమ్మ బాగా అగుపిస్తోంది. బాగా చూశాను. ఇంకోసారి, మరీ మరీ చూశాను. అమ్మ కుర్చీ పైన కూర్చున్నది. ఆ తట్టు ఈ తట్టు కంచు నీరాంజనములు. అమ్మ "పూలు ముడుచుకున్నది." ఎవరో అమ్మాయి తీరుగా పాడుతూ ఉంది. ఆ పాట విని అమ్మ చెక్కిళ్లు సంతోషంతో, సిగ్గుతో కెంపెక్కినాయి. నాకెంతో సంతోషం వేసింది. అమ్మ నవ్వుతూ ఉంది. ఇప్పుడు నేను అమ్మ దగ్గరికి పోతేనూ? ... అమ్మ కచ్చితంగా నన్ను కొట్టదు? బదులు నన్ను బుజ్జగిస్తుంది, మమకారంతో వీపు నిమురుతుంది గదా! పైపెచ్చు నన్నెత్తుకొని, తన తొడపైన కూర్చోబెట్టుకుంటుంది అనిపించింది. తక్షణమే నేను అమ్మ దగ్గరికి గెంతాను. అమ్మ తొడపైన ముఖం వాల్చాను ... కానీ పిడుగు పడ్డట్టు, నా నెత్తిపైన టంగుమని మొట్టికాయ పడింది. అమ్మ కొట్టింది! "ఛీ ... పీడ!" అమ్మ తిట్టింది!! నేను తబ్బిబ్బయి

అమ్మ ముఖం చూశాను. ఆ ముఖం కోపంతో మూసుకుపోయి ఉంది. ఉన్నట్టుండి, నన్నెవరో ఎత్తుకొని నా స్వస్థలానికి చేర్చివేశారు.

000

ఈగల్ని కొట్టడమే నా పనైపోయింది. నన్నెవ్వరూ మాట్లాడించడంలేదు. పొద్దుకింత ముద్ద వేస్తాడు పనిమనిషి. దాన్ని తింటూంటే, గత రోజులు మసక మసకగా జ్ఞప్తికొస్తాయి. అమ్మ చేయి కానరాక నాకు మెతుకు పట్టడంలేదు. అయితే ఆకలి బాధకు తట్టుకోలేక వాటన్నిటినీ నెట్టివేసి, గబగబా తిని, మామూలు ప్రకారంగా ఈగల్ని కొడ్తూ పడి ఉంటాను.

ఈ రీతిగా ఉన్నప్పుడూ ఒకరోజు ... అప్పుడే పుట్టిన కందమ్మ చేసే ఆక్రందనం నా చెవులబడ్డది! ఆ గొంతు అమ్మ గదినుంచి వచ్చిందే! పనిమనుషులు తొందరపాటుగా అటూ ఇటూ తిరుగుతున్నారు. "బాబాయ్.... బిడ్డ!" అని ఎవరో సంతోషంతో గంతు వేసిన సద్దు వినబడ్డది. నేను అమ్మ గదివైపు గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయాను.

000

ఇంకొకరోజు ...

అమ్మ గదినుంచి చంటిబిడ్డ గట్టిగా ఏడ్చే శబ్దం వినిపించింది. ఆ ఏడ్పుకి అంతు లేదనిపించింది. ఎవ్వరూ లేరు. పనిమనుషులు భోజనాలకోసం వెళ్లిపోయినారు. నేను ఇహ చేసేది లేక పరుగెత్తాను. అమ్మ గదిలో లేదు. నేలపైన, తెల్ల తివాసీపైన పాపాయి చేతులూ, కాళ్లనూ కొట్టుకొంటూ అటూ ఇటూ తన్నుకులాడుతూ ఉంది. ఏడుస్తూనే ఉంది అతి బిగ్గరగా. నేను పాపాయిని సమీపించాను. ముఖంలో మూతిపెట్టి చూశాను. ఒళ్లంతా చిన్న చిన్న బొబ్బలు! ఆ బొబ్బలు ఎందుకు లేచాయో? అదే సమయానికి సరిగ్గా అమ్మ దడదడ మెట్లెక్కి లోపలికి వచ్చింది. అయితే నేనక్కడ ఉండటం చూచి, బిడ్డ గట్టిగా ఏడ్వటం చూచి పెదవులు కొరుకుతూ తక్షణమే తలుపులు గడియ వేసి, అక్కడే పడివున్న బెత్తం తీసుకుని నన్ను కొట్టనారంభించింది ... "పెడుగా? కందమ్మ ఏం చేసిందనీ? ఎందుకు కొరికావూ?" అంటూ 'రెవ్‌రెవ్' ఈడ్చి కొట్టింది. నేను తప్పించుకోడానికి యత్నించలేదు. అటూ ఇటూ చలించలేదు. బదులు అమ్మ పాదాలముందు తల తగ్గించి, వీపు వంచాను. అమ్మ కొడుతూ ఉన్న దెబ్బలు, వాన చినుకుల్లా పడుతున్నాయి. ఏదో ఆశ నన్ను కదలకుండా చేసింది. ఏమిటంటే, కొట్టేది పూర్తిగా ముగిసిన తర్వాతయినా, చివరికి నా వీపునైనా ఒక్కసారి ఒకే ఒక్కసారి నిమరకుండా ఉంటుందీ, అమ్మ? అని లేచాను. అయితే బెత్తాన్ని అటు విసిరికొట్టి, ఆఖరికి అమ్మ నన్ను కాలితో గట్టిగా తన్నింది!

000

మధ్యాహ్నం. ఎండ మండుతూ ఉంది. అలాంటప్పుడు అమ్మ గది నుంచి ఏడుపు ధ్వని వినవచ్చింది. అయితే అది పాపాయి ధ్వని కాదు! అమ్మ గొంతే! అమ్మ బిగ్గరగా ఏడుస్తూ ఉంది. అయ్యో .... ఏం చేయును? అమ్మ ఏడుస్తూ ఉంది.

గది తలుపులు తెరుచుకున్నాయి. ఎవరో చర్మ సంచిని చేతబట్టి ఒకరిద్దరు బయటపడ్డారు ... రోదన ధ్వని గట్టిగా వినిపిస్తూ ఉంది. అక్కడికి పోవాలనిపించింది. ఈ సమయం అమ్మ నన్ను చూచి కనీసం కొంత సమాధానపడవచ్చు అని తలచాను. అయితే నేనక్కడకి వెళ్లడానికి వీలు లేకపోయింది. క్షణంలోనే పనిమనుషులు, చుట్టుపట్లవాళ్లూ అంతా గుమిగూడినారు ...

సంజెక్క తెల్లగుడ్డలో బిడ్డను బయటికి తెచ్చినారు. అమ్మ కందమ్మను కావలించుకుని ఏడ్చింది. అయితేనేం? ఎవరో ఆ పాపాయిని ఎత్తుకొని ఎక్కడికో వెళ్లిపోయినారు? తోడుకు పది, పన్నెండుగురు వెళ్లినారు ... ఆ పసిబిడ్డ నెత్తుకొని వెళ్లిపోతోంటే చూడలేక, అమ్మ "హో!" అని ఏడ్చింది. "పాపా....! పాపా! నన్ను విడిచిపెట్టి వెళ్లిపోతావా?" అని ఎద బాదుకొన్నది.

000

ఇల్లు 'బికో' అంటూ ఉంది. ఒక్కింతైనా జీవస్పందనం లేదు. తోటలోని చెట్టు కొమ్మపైన కాకి 'కర్‌ర్' అని అరిచిన సద్దు వినిపిస్తూంది. కోతుల 'అమక్ .... అమక్' అని గోలచేసే సవ్వళ్లు వినిపిస్తున్నాయి. కానీ, ఇంట్లో అందరూ ఉండగా ఎవ్వరూ లేనట్టే ఉంది. అమ్మ గది తలుపులు మూసుకుపోయి చాలా రోజులయ్యాయి ... పనిమనుషులు అక్కడా ఇక్కడా ఒరిగి నిదురిస్తూ ఉన్నారు. అమ్మను చూడాలనే ఉబలాటం నాలో ఎక్కువైంది. అయితే అక్కడి కెళ్లడానికెందుకో భయం ... ఎక్కడ కొట్టునో! అమ్మ ముఖం వోసారి చూడాలి. రెండు రోజుల నుంచి నాకెవ్వరూ అన్నం పెట్టలేదు. ఇలాంటి సమయంలో నన్నడిగే దెవరూ? ఆకలి బాధ తట్టుకోలేను. అమ్మను కనుగొంటే, నా పాలిపోయిన ముఖం చూసిగానీ, కనికరం చెంది, ఏదైనా తినడానికిస్తుందేమో!

ఆకలి బాధ హెచ్చుతూ ఉంది. తట్టుకోలేను. కొయ్య మెట్లనెక్కి, సద్దు చేయక గదిముందు నిలబడ్డాను. తలుపులు కొద్దిగా తెరుచుకుని ఉన్నాయి. మెత్తగా తలుపులు తీశాను. 'కిర్'మని సద్దయింది. లోపలికెళ్లాను. శబ్దమైనందుకు అమ్మ తల ఎత్తి చూచింది. నేనూ అమ్మను చూచాను.

అమ్మ చాలా చిక్కిపోయింది. అమ్మ రెప్ప వాల్చకుండా నన్ను చూచింది. నా కెందుకో ఆ చూపుల్ని చూచి భయమేసింది .... అయినా ఆకలి బాధతో అమ్మను చూచాను. ఏదైనా తినడానికి పెట్టునేమో అని. ఊహు, మెల్లగా లేచి కూర్చున్నది. నన్ను చూస్తూనే వుంది. ఎందుకో పెదవులు వణక నారంభించాయి. అమ్మ నావైపు చేతులు చాచి, లేచి వచ్చింది. నాకు అభిప్రాయమేసింది అమ్మ నాకేమీ పెట్టక ఊరికినే కొట్టడానికి వస్తూందని. గాభరాతో బయటికి గెంతాను. అమ్మ నన్ను పిలుస్తూ నన్ను వెంబడించింది. నేను రెండేసి మెట్లు దిగుతూ, మెట్ల కిందున్న చీకటి నిండిన గూటి మూలలో దాగుకొన్నాను. కొయ్య మెట్లపై అమ్మ పాదాలు 'దబ్ దబ్' అని వినిపించాయి. అక్కడా ఇక్కడా వెదికింది. నన్ను పిలిచింది. ఎంతకీ నేను కనపడకపోయేసరికీ అమ్మ నిదానంగా మెట్లెక్కుతూ గదికి వెళ్లిపోతూ ఉంది. ఆకలి బాధ మంటలా ఉంది. తట్టుకోలేక ఇప్పుడైనా ఏమైనా పెట్టవచ్చునేమో అని గూటి నుంచి బయటికొచ్చాను. నేను బయటపడిన సద్దు విని అమ్మ తక్షణం వెనుదిరిగి చూచింది. నేనూ అమ్మను చూశాను.

అమ్మ కళ్లలో నీళ్లు తిరిగాయి.

కళ్లనుంచి చుక్కలు రాలినాయి. పెదవులు వణకినాయి. నన్ను చూసిన తడవుగా అమ్మ రెండు బాహువుల్ని జాచింది. నన్ను 'రా' అని పిలిచినట్లు. నన్ను ఎత్తుకోడానికి ఓ అంగ ముందుకేసింది.

నేను అమ్మనే చూస్తూ ఉన్నాను. ఇక అమ్మ కొట్టదా ఏం? నన్నెత్తుకొంటుందా? నా ఆకలి తీర్చుతుందా? ... నన్ను తన దగ్గిరే వుంచుకొంటే .... వుంచుకొంటే .... తప్పక నన్ను చేరదీస్తుంది!

నేను పరుగెత్తాను. అమ్మ పాదాలపై ముఖం వాల్చాను. అమ్మ పాదాల్ని ప్రీతితో, నాలుకతో స్పృశిస్తూ ఉండిపోయాను! నా నెత్తిపైన రెండు కన్నీటి చుక్కలు రాలినాయి?

నేను విశ్వాసంతో తోకను అటూ ఇటూ వూగించాను!

నేను మమకారంతో "కుఁయ్ ... కుఁయ్...!" అన్నాను.

■

**వీరభద్రంగారి ఈ కథ 9.7.1958 ఆంధ్రప్రభ సంచికలో ప్రచురితమయింది**